విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 04, మే 2023

ఘనంగా ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: ఏఐవైఎఫ్ 64 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సప్తగిరి సర్కిల్ నుండి ఆర్ టి సి బస్టాండ్ , గుత్తి రోడ్డు మీదుగా ఎన్టీఆర్ మార్గ్ 80 ఫీట్ రోడ్ వరకు యువజన విభాగం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమాఖ్య ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమితి మాజీ సభ్యుడు జమీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ముందుగా సంతోష్ కుమార్ ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు అనంతరం రాష్ట్ర సమితి మాజీ సభ్యుడు జమీర్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ శాంతి, అభ్యుదయం,శాస్త్రీయసోషలిజం, విద్య, వైద్యం ఉపాధి హక్కుల సాధన కోసం చదువు కొన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ ఉపాది అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. దేశ స్వతంత్రం కోసం ప్రాణాలను త్యాగం చేసిన విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్,చంద్రశేఖర్ ఆజాద్,అల్లూరి సీతారామరాజు,కొనగంటి హనుమంతరావు ఆశయ సాధనకై అమర్ వీరుల స్ఫూర్తితో 1959 మే 3 న దేశ రాజధాని ఢిల్లీలో ఏఐవైఎఫ్ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించి పోరాడి సాధించిన చరిత్ర ఏఐవైఎఫ్ కు ఉందన్నారు. ఎంతో నైపుణ్యత కలిగిన యువత మనదేశంలో ఉన్నప్పటికీ వారికి ఉద్యోగ అవకాశాలు స్వయం ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఏఐవైఎఫ్ లక్ష్య సాధనకోసం నేటి యువత భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల పట్ల తమ నిరంకుశ వైఖరిని వీడనాడాలన్నారు. ఉద్యోగాల కల్పనలో పక్క రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేతగా జగన్ 2.5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసగించాడని ఏకరువు పెట్టారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని వయోపరిమితి మించడంతో నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్యలు వైపు మొగ్గు చూపుతున్నారని అవి జరగ కుండా ఆపాలన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులు ఎటువైపున్నారో స్పష్టంగా తెలియజేసినా రాష్ట్ర ప్రభుత్వానికి. సిగ్గు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని. డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి మోహన్ కృష్ణ ,అధ్యక్షుడు శ్రీనవాస్, సీనియర్ నాయకుడు రాజు, నగర కార్యవర్గ సభ్యులు దేవ,లిఖిల్ ,శ్రీకాంత్, ఎపి మహిళా సమాఖ్య నగర అధ్యక్ష కార్యదర్శులు జానకి, కుర్షిద,నాయకులు రామాచారి హరి, పీర్, షెక్ష, తులసి రామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ కళాశాలపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-రాయదుర్గం: పట్టణంలోని ముందస్తు ప్రకారం చేస్తున్న స్కూల్ అనంతపురం నగరంలో ఉన్న గ్లోబల్ జూనియర్ కళాశాల ముందస్తు ప్రచారాలు చేస్తున్న. యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశారు. రాయదుర్గం తాలూకా పట్టణంలో ఉన్నటువంటి ఏవిఆర్. ప్రైవేట్ స్కూల్ ముందస్తు ప్రచారంతో నగరంలో పలుచోట్ల బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారానికి తెరలేపారని, ఏవిఆర్ స్కూల్ పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకొని సీజ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ అఖిల భారత యువజన సమైక్య ఏఐవైఎఫ్. ఆధ్వర్యంలో ఏ వి ఆర్ స్కూల్ బ్యానర్లు అనంతపురం గ్లోబల్ స్కూల్ జూనియర్ కళాశాల బ్యానర్లను తొలగించారు. ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు అంజి, ఏఐవైఎఫ్ తాలూక ప్రధాన కార్యదర్శి కోట్రెష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఉన్నటువంటి స్కూల్లో జూనియర్ కాలేజీలు ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతూ ఘనంగా పట్టణంలో పలు వీధుల్లో బ్యానర్లు వారి స్కూల్ గొప్పలు చెబుతూ విద్యార్థుల విద్యార్థులు తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నారు. అరవింద్, తరుణ్, మనోజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించాలి

విశాలాంధ్ర-విడపనకల్లు: కర్ణాటక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన విడపనకల్లు మండలం దోనేకల్లు, హావలిగి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కర్ణాటక బార్డర్ చెక్ పోస్ట్ ను బుధవారం అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు గుంతకల్ డివిజన్ డిఎస్పి నర్సింగప్ప, ఉరవకొండ గ్రామీణ సీఐ బి శేఖర్ సందర్శించారు. వారు చెక్ పోస్ట్ సిబ్బందితో వారు మాట్లాడుతూ ముందుగా వాహనాల నమోదు రిజిస్టర్ పరిశీలించారు. వాహనాల రాకపోకలపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. సెబ్ ఎస్సై రమణారెడ్డి, ఏఎస్ఐ వెంకటరమణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నిర్బంధాలు...అక్రమ అరెస్టులు

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు వామపక్షాలు పిలుపునివ్వడంతో జిల్లా వ్యాప్తంగా సీపీఐ. సీపీఎం. కాంగ్రెస్. కార్మిక సంఘాల నాయకుల అరెస్టులు, గృహనిర్బంధాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగాయి. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు...అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని నీరుగార్చలేరంటూ నాయకులు నినదించారు. తెల్లవారుజాము నుంచే నాయకులకు నోటీసులు అందజేశారు. 32 మంది బలిదానాలతో సాధించిన కర్మాగారాన్ని బీజేపీ ప్రభుత్వం 30 వేల కోట్లకు కార్పోరేట్లకు కట్టబెట్టడాన్ని దుర్మారం అని వామపక్ష నేతలు మండిపడ్డారు.

విశాలాంధ్ర-ఉరవకొండ: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వామపక్షాలు, కార్మిక సంఘాలు చేపట్టనున్న రాస్తారోక కార్యక్రమాల్ని జరగకుండా ముందుగానే ఉరవకొండ పోలీసులు సిపిఐ, సిపిఎం కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులకు నోటీసులు అందజేశారు. అరెస్ట్ అయిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి తలారి మల్లికార్జున, కృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్ నాయు డు, జ్ఞానమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోనియా సీన అబ్బాస్ విరుతోపాటు వజ్రకరూరు పోలీ సులు కూడా సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, సిపిఎం నాయకులు కృష్ణమూర్తి, సిద్ధార్థను అరెస్టు చేశారు.

రాప్తాడు: బుధవారంఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వామపక్ష నాయకులను ఇటుకపల్లి సర్కిల్ సీఐ మోహన్, ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి అరెస్టు చేసి రాప్తాడు స్టేషనుకు తరలించారు. మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి గౌని శారద, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు జి. దుర్గాప్రసాద్, మండల సహాయ కార్యదర్శి ఎం. చలపతి, సీపీఎం మండల కార్యదర్శి పోతులయ్య, నారాయణస్వామి, బాషా, ఖాదర్ భాషా, పాపమ్మ, దేవీ, లక్ష్మి, రామక్క, లక్ష్మిదేవి, ముత్యాలక్క తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: నియోజకవర్గ సిపిఐ నాయకులను ముందస్తుగా సీపీఐ కార్యాలయం వద్ద పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున ఈ సందర్భంగా మాట్లాడుతూ వామపక్షాల ఆధ్వర్యంలో కార్మిక ఉద్యోగ సంఘాలు చేపట్టిన రాష్ట్రవ్యాప్త రాస్తో రోకో కార్యక్రమాన్నికీ బయలు దేరుతున్న నాయకులను అరెస్ట్ చేయడం దారుణమని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట్రెష్, సీపీఐ నాయకులు దుర్గన్నా, నరసింహులు, తిప్పేస్వామి, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు అంజి, ఏఐవైఎఫ్ నాయకులు తరుణ్, వంశీలను అరెస్టు చేశారు.

శింగనమల: సిపిఐ మండల కార్యదర్శి తరిమెల రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్పయాదవ్ లను శింగనమల పోలీసులు ముందస్తుగా బుధవారం తెల్లవారు జామున ముందస్తు అరెస్టులు చేయడం తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నామన్నారు. చేనేత మండల కార్య దర్శి నేసే మధు, లక్ష్మి రంగయ్య, ఓబిరెడ్డి, ఆదెన్న, రవి శంకర్, నాగరాజు, శ్రీనివాసులు, రామసుబ్బారెడ్డి అరెస్టు చేశారు

పుట్లూరు: సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్యను ఉదయం 6 గంటలకే పోలీసులు ఇంటికి వచ్చి ముందస్తు అరెస్టు చేస్తున్నట్లు చెప్పడం దారుణ మన్నారు. అరెస్టు అయిన వారిలో చేతి వృత్తిదారుల సమైక్య మండల అధ్యక్షుడు సి ఓబుళపతి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వీరయ్య, రైతు సంఘం నాయకులు పెద్ద కొండయ్య, బాల కొండయ్య ఉన్నారు.

యాడికి: పెద్దవడుగూరు మండలంలోని సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి సిపిఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ సిపిఐ నాయకులు ముత్యాల రెడ్డి లను బుధవారం ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి అరెస్టు చేశారు .

కూడేరు: సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి కురుగుంట మనోహర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌కు పోలీసులు నోటీసులు అందజేశారు.

విడపనకల్లు: రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా సిపిఐ అనుబంధ సంఘం నాయకులు ఏఐటియుసి నియోజ కవర్గ కార్యదర్శి చెన్న రాయుడు బుధవారం విడపనకల్లు పోలిసులు ముందస్తు అరెస్టు చేశారు.

తాడిపత్రి: విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆపాలని సిపిఐ మండల కార్యదర్శి నాగ రంగయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని సజ్జల దిన్నె గ్రామ నివాసి సిపిఐ మండల కార్య దర్శి నాగ రంగయ్య రాస్తారోకోలో పాల్గొనక ముందే అరెస్టు చేశారు. నాయకులు నారాయణరెడ్డి, రంగేష్ పాల్గొన్నారు.

అనంతపురం వైద్యం : బుధవారం రాస్తోరోకో కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు ఇంటికి వచ్చి నోటీసులు ఇవ్వడంతో ఆత్మకూరు సిపిఐ మండల కార్యదర్శి సనప నీళ్లపాల రామకృష్ణ తీవ్రంగా ఖండించారు.

గుంతకల్లు : స్థానిక భగత్ సింగ్ కూడలి వద్ద సీపీఐ, ఏఐటియుసి, సీపీఎం ఆధ్వర్యంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ ,సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్ ,ఏఐటియుసి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్రలు రాస్తారాకోని నిర్వహించారు. కార్యకర్తలు పోలీసులకు మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనుమతి లేదంటూ పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేయగా నాయకులు కార్యకర్తలు రోడ్డుపైన కూర్చుని నిరసన తెలియజేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, సిపిఐ నియోజవర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి, ఏ ఐటియు సి మండల కార్యదర్శి ఈశ్వరయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు, మురళికృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసులు, సిపిఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, సాకే నాగరాజ్ రమేష్ లను ముందస్తుగా నోటీసులు అందజేసి అరెస్టు చేశారు. డిహెచ్పిఎస్ నాయకులు మల్లయ్య, సిపిఐ నాయకులు చిదాంబరం, లింగమూర్తి ,గురు స్వామి, నాగేంద్ర ,మహిళా సమైక్య నియోజకవర్గం కార్యదర్శి రామాంజినమ్మ పాల్గొన్నారు.

పలు పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర - జె ఎన్ టి యు ఏ: జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఫార్మా.డి. నాలుగవ , ఐదవ సంవత్సరం (ఆర్17) రెగ్యులర్ , ఫార్మా.డి. ఐదవ సంవత్సరం (ఆర్ 14) , ఎంబీఏ రెండవ సెమిస్టర్ , నాలుగవ సెమిస్టర్ (ఆర్17) , రెండవ సెమిస్టర్ (ఆర్21) సప్లమెంటరీ , ఎమ్మెస్సీ మూడవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ , ఎంసీఏ మూడవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యు యేషన్ ఆచార్య ఇ. కేశవరెడ్డి , కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ ఆచార్య బి. చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాలను వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

జొన్నల పంపిణీ

విశాలాంధ్ర-విడపనకల్లు: మండలంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల నుంచి బియ్యం, చక్కెర, కందిబేళ్లతో పాటు ఒక కిలో జొన్నల కూడా పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని బుధవారం విడపనకలు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్ రెడ్డి, తహసిల్దార్ బ్రహ్మయ్య, సి ఎస్ డి టి లక్ష్మీదేవి, ఏం డి యు ఆపరేటర్ల ద్వారా కార్డు లబ్ధిదారులకు అందించారు. ఈ మండల స్థాయి అధికారులు రేషన్ కార్డు లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు అందించాలని, అవకతవకులు జరిగితే ఉపేక్షించమని ఏం డి యు ఆపరేటర్లకు డీలర్లకు ఎమ్మార్వో మరియు ఎంపీపీ చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వో చత్రనాయక్, వైసీపీ నాయకుడు కరణం భీమిరెడ్డి, సర్పంచ్ సుశీల, వీఆర్వోలు చత్రనాయక్, రంగస్వామి, వైసిపి నాయకులు ఉమాశంకర్, మాధవరెడ్డి, భీమలింగప్ప, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని సిద్దరాంపురం గ్రామ శివారులో నీటి బావిలో ఈత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బొమ్మనహాళ్ ఎస్ఐ శివ తెలిపిన వివరాల మేరకు డీ.హీరేహాళ్ మండలం తిమ్మలాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్(28) అనే యువకుడు మండలంలోని సిద్దరాంపురంలో వివాహం చేసుకున్నాడు. అక్కడ బంధువుల గృహ ప్రవేశం ఉండడంతో ఉదయం భార్య వంద్రమ్మతో కలిసి గృహ ప్రవేశానికి వెళ్లారు. గృహ ప్రవేశం ముగిసిన తరువాత మధ్యాహ్నం సమయంలో ఎండవేడిమి ఎక్కువగా ఉండడంతో గ్రామశివారులోని ఒక నీటిబావిలో ఈతకు వెళ్లాడు. అయితే బావిలో లోతుగా ఉండడం వల్ల ప్రమాదవశాత్తు ప్రమాదం చోటు చేసుకొని మృత్యు వాత పడినట్లు తెలిపారు. భార్య వంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వెండి శఠగోపం బహుకరణ

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి వారికి కర్నూలు నగరానికి చెందిన అభీష్ట గణపతి మేనేజింగ్ ట్రస్ట్ కు చెందిన జంపాల మధుసూదన్-జంపాల శ్రీకాంతి అనే భక్తుడు అరకిలో (501 గ్రాములు) వెండితో తయారు చేసిన శఠగోపాన్ని బుధవారం ఆలయ ఈఓ విజయ్ కుమార్ కు అందించారు. అనంతరం ఆలయంలో శఠగోపానికి ప్రత్యేక పూజలు చేశారు. మధుసూదన్-జంపాల శ్రీకాంతి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక నుంచి స్వామివారిని దర్శించుకునే భక్తులను ఆశీర్వదించేందుకు ఈ వెండి శఠగోపానికి ఉపయోగిస్తామని ఆలయ అర్చకులు ద్వారాకనాథ్, మయూరం బాలాజీ తెలిపారు.

'విశాఖ ఉక్కు'ను కాపాడలేని దద్దమ్మ సీఎం జగన్

ప్రైవేటీకరణ దుర్మార్గమైన చర్య
రెండేళ్లుగా పోరాడుతున్న
నోరుమెదపని ముఖ్యమంత్రి
కేసుల భయంతో
మోదీ భజన చేస్తున్న జగన్
అక్రమ అరెస్టులతో
ఉద్యమాలను ఆపలేరు
పోలీసుల లాఠీలకు భయపడం
సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఐ, ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు కన్నెర్ర చేశారు. ఈ మేరకు బుధవారం నగర శివార్లలోని తపోవనం సర్కిల్ జాతీయ రహదారిపై రాస్తా రోకోకు ఆపార్టీ నాయకులు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే పోలీసులు ముందస్తుగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్,నగర కార్యదర్శి శ్రీరాములు ,ఇతర నాయకులను పోలీసులు తెల్లవారు జామునే ఇళ్లవద్దకు వెళ్ళి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని రాస్తారోకో , నిరసన కార్యక్రమాలకు వెళ్తున్న ఆయా పార్టీల నాయకులను పోలీసులు అప్రజాస్వామికంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మూడు లక్షల కోట్ల రూపాయల ఆస్తులున్న విశాఖ ఉక్కు కర్మాగారం కేవలం 30 వేల కోట్లకే ప్రధాని మోదీ తన స్నేహితుడు అదానీకి తెగనమ్ముతుంటే సీఎం ఆ ప్రక్రియను ఆపకపోగా చేతకాని దద్దమ్మలా నోరుమెదపడం లేదని ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 32 మంది కార్మికుల బలిదానాలతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బిజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అని ఘాటుగా వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు తెగనమ్ముకుంటోందని విమర్శించారు. అందులో భాగంగానే లక్ష మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడానికి బీజేపీ కుట్ర చేస్తోందని విరుచుకు పడ్డారు. రెండు సంవత్సరాలుగా బాధితులు నిరసనలు ఉద్యమాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని నిప్పులు చెరిగారు. సీఎం జగన్‌కు 151 మంది ఎమ్మెల్యేలు 31 మంది పార్లమెంటు సభ్యులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వ రంగాలను, విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల పాలనలో సీఎం జగన్ రాష్ట్రానికి చేసిందేమీ లేదని తనపై ఉన్న కేసుల భయంతో ప్రధాని నరేంద్ర మోదీ వద్ద మోకరిల్లడమే పనిగా పెట్టుకున్నాడని తూర్పారబట్టారు. అదానీ డొల్ల కంపెనీల వ్యవహారాన్ని అమెరికా పరిశోధన సంస్థ బట్టబయలు చేసి నివేదిక సమర్పించిన అనంతరం గౌతమ్ అదానీ గుట్టు రట్టయిందని ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతోనే అదానీ లక్షల కోట్లు గడించాడని ఘాటుగా విమర్శించారు. ఈ వ్యవహారం నిగ్గు తేల్చేందుకు దేశ వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు ఏకమై ఉభయ సభల్లో జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రధాని నరేంద్ర మోదీ ఒక్క మాట కూడా ఆదాని పై మాట్లాడటం లేదని ఏకరువు పెట్టారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదానీకి విశాఖ, అనంతపురం జిల్లాల్లో భూములు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మిలిటెంట్ ఉద్యమాలకు వెనుకాడబోమని పోలీసుల లాఠీలకు భయపడే ప్రసక్తే లేదని జాఫర్ తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఎల్లుట్ల నారయణ స్వామి, చాంద్ బాష, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయ్ స్వామి, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ప్రభాకర్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీల ఇళ్లు ముట్టడిస్తాం

విశాఖ ఉక్కును పరిరక్షించుకుంటాం
పాలక పార్టీలు ఎటువైపో తేల్చుకోండి
ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు,
సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రాణ త్యాగానికైనా సిద్ధమేనని రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్ష పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని, లేని పక్షంలో ఎంపీల ఇళ్లను ముట్టడిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు,సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి సంయుక్తంగా పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త కార్మిక సంఘాల పిలుపులో లో భాగంగా నగర శివార్లలోని తపోవనం సర్కిల్ నేషనల్ హైవే పై రాస్తారోకో నిర్వహించారు. ఈనేపథ్యంలో పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం అనేక పోరాటాలు జరగాయని ఎంతో మంది కమ్యునిస్టు నేతలు తమ పరిపాలనా పదవులకు రాజీనామాలు చేశారన్నారు. అయితే నేడు అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ అందులో భాగంగా విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయడానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. ఉక్కు పరిశ్రమ అభివృద్ధి పై లక్షలాదిమంది కార్మికులు ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని అలాంటి వారి కడుపులు కొట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నాయని ఏకరువు పెట్టారు. సిగ్గు లజ్జ ఉన్న ప్రజా ప్రతినిధులైతే రాష్ట్రంలోని ఎంపీలు రాజీనామాలు చేసి విశాఖ ఉక్కు పరిరక్షణకు కలసి రావాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకుపోవాలని ఆందోళనకి పిలుపిస్తే పోలీస్ యంత్రాంగం ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారన్నారు. లేనిపక్షంలో ఎంపీల ఇళ్లను ముట్టడిస్తామని పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు,జిల్లా నాయకులు శ్రీనివాసులు, రాజు, శివకృష్ణ, హరికృష్ణ,నారాయణ, నరసింహులు,బాబు,సీపీఐ నాయకులు లింగమయ్య, రమణయ్య, అల్లిపిరా,సుందర్ రాజు, ప్రసాద్,మున్నా పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలోని రహమత్పూర్ ఎల్ఐసి కార్యాలయం ముందు, బుధవారం ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లు కుల్లాయప్ప, సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద్,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు కృష్ణ ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకులు చలపతి జెండాను ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బిల్లు కుల్లాయప్ప మాట్లాడుతూ, దేశంలో జనాభా కంటే నిరుద్యోగ సమస్య రోజు రోజుకు ఘణనీయంగా పెరుగుతుందని,పాలకుల స్వార్థప్రయోజానాలకోసం యువతను పక్కదారిపట్టిస్తూ, ఎన్నికల సమయంలో అపద్దపుహామీలు ఇస్తూ కాలయాపన చేస్తున్నారేతప్ప సరైన సమయంలో నోటిఫిషన్ విడుదల చేయకుండా అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్రప్రభుత్వం కాలయాపన చేస్తున్నారన్నారు.రాష్ట్రప్రభుత్వం తమ కార్యకర్తలు కార్పొరేషన్ తదితర నామినేటెడ్ పదవుల ద్వారా పదవులు ఇచ్చి, రాజకీయ నిరుద్యోగ సమస్య తీర్చింది తప్ప, మిగిలిన ప్రభుత్వ శాఖల్లో కాలిగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాల తీరు మారకపోతే రాబోయే కాలంలో నిరుద్యోగులను కలుపుకొని, ఉద్యమానికి శ్రీకారం చుడతామని తెలిపారు. బషీర్, వేంకటేష్, అయూబ్ బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి

విశాలాంధ్ర-తలుపుల: స్థానిక మేజర్ పంచాయతీలో ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది స్వార్థపరులు అక్రమ సంపాదన ధ్యేయంగా అడ్డగోలుగా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని వాటిని లక్షల ,కోట్లల్లో దోచుకుని ఘటన తలుపుల మండలంలో వెలుగు చూసింది. వివరాలకు వెళితే మండల కేంద్రంలో కదిరి ప్రధాన రహదారి కొరగుట్టపల్లి రోడ్డు ప్రక్కనే విలువైన భూమి సర్వేనెంబర్ 1047 కలదు. ఈ సర్వే నెంబర్ భూమిలో గతంలో పోలీస్ స్టేషన్ కు పత్రిక విలేకరులకు స్థలం కేటాయించారు. అయితే తమదే అని ఒకరిద్దరూ తమ ఆధీనంలో భూమిని స్వాధీనం పరుచుకొని వాటిని గుట్టు చప్పుడు కాకుండా మండల కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేట్ వైద్యుడు కు అమ్మినట్లు తెలిసింది. డి పట్టా అమ్మడం కొనడం ఎంత నేరము ఆ భూమిని తీసుకోవడమే అంత నేరంగా పరిగణములోకి తీసుకొన బడుతుంది. తలుపుల మండలం లో పేరు మోసిన ఓ ప్రైవేటు వైద్యుడు ఆ భూమిని ఎలా కొన్నారో మతలంబు ఏంటో ఎవరికి అంతు పట్టడం లేదు. తమ స్వాధీనంలో ప్రభుత్వ భూమి ఉంది కదా తమకే దక్కుతుందన్న నెమముతో ప్రభుత్వమే ఇలా ఆ ప్రైవేట్ వైద్యులకి ఎలా అమ్ముతారని స్థానిక ఇన్చార్జ్ తహశీల్దార్ కు సిపిఐ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు ఎల్వి రమణ, సిద్దయ్య, అశోకు రెవెన్యూ శాఖపై మండిపడ్డారు. స్పందించిన తహసిల్దార్ ప్రభుత్వ భూమి ఎవరు ఆక్రమించుకున్న రెవిన్యూ శాఖపరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. వెంటనే ఆ భూమి దగ్గరికి వెళ్లాల్సిందిగా ్య ఇన్స్పెక్టర్,విఆర్ఓకు ప్రభుత్వ భూమిని తమఆధీనంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

ముందస్తు అరెస్టులు దారుణం

విశాలాంధ్ర - నార్పల: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని రాస్తారోకో కార్యక్రమాలకు వామపక్ష సీపీఐ పిలుపునిస్తే ముందస్తు అరెస్టులు చేయడం దారుణమని రైతు సంఘం నార్పల మండలకార్యదర్శి ఎస్.మారుతీ, ప్రసాద్, సీపీఐ సీనీయర్ నాయకులు చాపలరామాంజి, గంగాధరను అరెస్టు చేయడడం జరిగింది.

లక్ష్యంతో విజయం తథ్యం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: ప్రతి విద్యార్థి లక్ష్యముతో ముందుకు వెళితే విజయం తథ్యం అని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన" ఉద్యోగ విజయోత్సవం సభకు" ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బాలజ్యోతి తో పాటు అధ్యాపకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇటీవల మార్చి 29వ తేదీన ఉద్యోగమేల కార్యక్రమము నిర్వహించిన వాటిలో ప్రతిభ కనబరిచిన 35 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలను వారు అందజేశారు. ప్రిన్సిపాల్ బాలస్వామి,టిపిఓ జెసింత్ రాజా,అధ్యాపకులు బాల జోషి,కళ్యాణి, బోధనేతర బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి

విశాలాంధ్ర-కదిరి: ఉత్తరప్రదేశ్ సహరన్ పుర లోని రాయల్ క్యాసల్ నందు ఏప్రిల్ 29 నుండి మే రెండవ తేది వరకు జరిగిన మొదటి నేషనల్ శుయ్ జియో (చైనిస్ రెజ్లింగ్) వర్క్ షాప్ నందు కదిరి ప్రాంతానికి చెందిన కరాటే మాస్టర్ డా. షేక్షవలి తెలిపారు. ఈ కార్యక్రమానికి వరల్డ్ సీనియర్ గ్రాండ్ మాస్టర్లు ఇటలీకి చెందిన ఆంటోనీయో లాంగియాను,అలస్సి శిక్షణ తర్ఫీదు ఇచ్చారన్నారు.కదిరి ప్రాంత విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ నుండి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. విద్యార్థులకు శిక్షణ సర్టిఫికెట్స్ అందజేశారు.

ఉచిత బాస్కెట్బాల్ శిక్షణ శిబిరం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 5వ తేదీ నుండి నెల రోజులపాటు జిల్లా క్రీడాపాధికారిక సంస్థ సహకారంతో ఉచిత బాస్కెట్బాల్ వేసవి శిక్షణ శిబిరమును నిర్వహిస్తున్నట్లు ధర్మాంబా బాస్కెట్బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి, అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడుహిదాయతుల్ల బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా జీవితములో మంచి గుర్తింపును ఇస్తాయని, బాల, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణా శిబిరం ఉదయం సాయంత్రం రెండు పూటలా కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 9030944717 కు గాని 9391710032 కు సంప్రదించాలని వారు తెలిపారు.

ఎన్‌సిసి యూనిట్ మంజూరు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణంలోగల పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2023-24 విద్యా సంవత్సరానికి బాలుర యన్.సి.సి యూనిట్ మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలం రమేష్ రెడ్డి పేర్కొన్నారు. కళాశాలకు మొత్తం 102 సీట్లు మంజూరు కాబడ్డాయని తెలిపారు. 2023లో డిగ్రీ ప్రథమ సంవత్సరం చేరబోవు విద్యార్థులకు మాత్రమే యన్.సి.సి లో చేరడానికి అర్హత ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పాసైన విద్యార్థులు కళాశాలకు వచ్చి , యన్.సి.సి. లో చేరడానికి వారి పేర్లను నమోదు చేసుకొనవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు.

మాజీ ఎంపీపీ మృతి

విశాలాంధ్ర-రొళ్ల: మండలంలోని ఆవినకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ వి.దేవరాజ్(62)గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మాజీ ఏపీపీసీసీ అధ్యక్షుడు మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పాడేమోసి తన అభిమానాన్ని చాటుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు బి.అనంతరాజు, తెదేపా సీనియర్ నాయకుడు ఆర్డబ్ల్యూఎస్ రిటైర్డ్ ఏఈ మల్లికార్జున, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంగులవాయి ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పాండురంగప్ప, సన్నతిమ్మప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్.గౌడప్ప, గుడిబండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు, అగళి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకేష్, తెదేపా మండల అధ్యక్షుడు దాసిరెడ్డి, తెదేపా జిల్లా కార్యదర్శి ఎస్.రవిభూషణ్, కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అన్వర్, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు డి.ఆర్ జ్యోతి, కాంగ్రెస్ పార్టీ నాయుకులు పాండురంగారెడ్డి,వెంకట రమణప్ప, జగన్నాథ్, గంగారామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు దేవరాజ్ భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే పై దాడి చేయడం హేయమైన చర్య

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే శంకర్ నారాయణ పై సోమవారం అసమతి వైసిపి నాయకుడు ఈదుల బలాపురం నాగభూషణ రెడ్డి తన అనుచర వర్గంతో గడపగడపకు వెళ్తున్న ఎమ్మెల్యే పై దాడి చేయించడం అనుచితంగా ప్రవర్తించడం హేమమైన చర్యగా బీసీ, కురుబ సంఘం నాయకులు బుధవారం రహదారులు భవనాలు పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ నాగభూషణ రెడ్డి చేసిన పని మంచిది కాదని, అతను బీసీ ఎమ్మెల్యే పై అనుచితంగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని, అతనికి సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దగ్గర చర్చించి అభివృద్ధి కోసం ఒకరినొకరు సహకరించాల్సింది పోయి అవమానపరచడం, కించపరచడం, మంచి పద్ధతి కాదని, మరల ఇలాంటి పనులు చేస్తే బీసీలు ఊరుకునే పరిస్థితి లేదన్నారు. పద్ధతి మార్చుకోకపోతే పరిస్థితులు వేరుగా ఉంటాయని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండ్లి సర్పంచ్ కిష్టప్ప, సానిపల్లి సర్పంచ్ పరమేశ్వరప్ప, అగ్రి చేర్మెన్ కొండలరాయుడు,మండల ఉపాధ్యక్షులు రామాంజనేయులు, హనుమంతు, వెంకట్ రాముడు, ఇతర బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు.

సక్రమంగా రుణాలు రెన్యువల్ చేయాలి

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల కేంద్రంలో ఉన్న కెనరా బ్యాంకులో వ్యవసాయ రుణాలను సక్రమంగా రెన్యువల్ చేయాలని ముదిగుబ్బ తెదేపా పట్టణ అధ్యక్షులు తుమ్మల మనోహర్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంకులో రైతుల రుణాల రెన్యువల్ కు ఉచితంగా ఇవ్వవలసిన అప్లికేషన్ కు ఒక్కొక్కరి నుంచి అక్రమంగా 200 రూపాయలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం తెదేపా పట్టణ అధ్యక్షులు తుమ్మల మనోహర్ పాత్రికేయులతో కలిసి కెనరా బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లగా మేనేజర్ రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం మోహన, నారాయణస్వామి, రామచంద్ర,రమణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రవేటీకరణ ఆపాలి







విశాలాంధ్ర-పుట్టపర్తి: విశాఖ ఉక్కు ప్రవేటికరణ ను కేంద్ర ప్రభుత్వం ఉపశమహరించుకోవాలని సిపి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ రాష్ట్ర సమితిలో పిలుపులో భాగంగా పుట్టపర్తి సిపిఐ అద్వర్యం లో గణేష్ సర్కిల్ నందు రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా విశాఖ ఉక్కును ప్రవేటు పరం చేయడానికి పూనుకుందని దీనిని ఆపేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఏ మాత్రం చొరవచోపకుండా కేంద్రానికి తాలోగ్గు తున్నాడని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేనినాదాముతో సాధించిన కర్మగారాన్ని ప్రధాని మోడీ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి పునుకున్నాడని, ప్రైవేట్ పరం చేస్తే 20వేల మంది కార్మికులు రోడ్డున పడతారన్నారు. కార్మికుల పొట్ట కొట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పుట్టపర్తి పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి,ఏఐటీయూసీ నాయకులు గౌసులాజం, వెంకటరమణ,మహిళా సంఘం ఈశ్వరమ్మ, లక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

తనకల్లు: విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్లకు సహకరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరి తీరుకు నిరసనగా సిపిఐ పార్టీ చేపడుతున్న రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా తనకల్లులో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కేంద్రంలో రెడ్డప్ప, రైతు సంఘం అధ్యక్షుడు చౌడప్ప యాదవ్, ప్రధాన కార్యదర్శి ఇక్బాల్, సహాయ కార్యదర్శి కరీముల్లా,సిపిఎం నాయకులు శివన్న,చలపతి పాల్గొన్నారు.

కదిరి: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని లేదంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పతనం తప్పదని కదిరి వేమారెడ్డి సర్కిల్లో సీపీఐ నాయకులు రోడ్డురాస్తారోకో నిర్వహించారు. బుధవారం సిపిఐ నియోజవర్గ కార్యదర్శి బి కదిరప్ప,సిపిఐ పట్టణ కార్యదర్శి లియాకత్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించాలని కోరారు.ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు మధు నాయక్, పట్టణ సహాయ కార్యదర్శి మనోహర్, సిపిఐ నాయకులు ముబారక్ శంకర్, హనుమంతు రెడ్డి,రమణ, జమీర్, భాష, రవి, జన,మంగమ్మ, నాగలక్ష్మి, ఆశిక్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: విశాఖ ఉక్కు ప్రవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఐ నాయకులు బుధవారం తాహసిల్దార్ శ్రీధర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వివరించడం సిగ్గుచేటన్నారు.సిపిఐ మండల కార్యదర్శి చలపతి,కార్యదర్శులు గంగు లప్ప,రమణ,అంజినప్ప,నారాయణ, నరసింహ నాయక్,కళావతి ,శాంతమ్మ, పాల్గొన్నారు.

సమస్యలతో సర్వసభ సమావేశం

విశాలాంధ్ర-కొత్తచెరువు: సర్వసభ సమావేశాలు జరుగుతున్నాయి కానీ సమస్యలు అధికారులు ఏమాత్రం పరిష్కరించలేదని, ఇలాంటి సమావేశాలు ఎందుకు నిర్వహించాలని, సర్పంచులు, ఎంపీటీసీలు మండల సమావేశంలో తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నదని, వేసవికాలంలో ఇళ్లలో ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎందుకు కోతలు విధిస్తున్నారని పలువురు సర్పంచులు నరేందర్ రెడ్డి అలివేలమ్మ, ఎంపీటీసీ రఫీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్తు ఏయే వెంకటేష్ నాయక్, నరేందర్ రెడ్డి, విద్యుత్తు ఏఈ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ ట్రాన్స్ఫారములు కొరత ఉన్నందున లో వోల్టేజ్ తో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, ఈ విషయాన్ని డీఈ దృష్టికి తీసుకు వెళ్ళానని, త్వరలోనే కొత్త చెరువులో నూతనంగా నాలుగు ట్రాన్స్ఫారాలు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఐకెపి కార్యాలయంలో యానిమేటర్లు సిబ్బంది కలిసి 30 లక్షల వరకు అవినీతికి పాల్పడ్డారని, ఆ సొమ్మును రికవరీ చేయాలని, ప్రజా ప్రతినిధులు కోరారు. ఏపిఎం నాగేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతము వీటి పైన విచారణ జరుగుతుందని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ సర్వసభ సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నటరాజు,ఇంచార్జ్ ఎంపీడీవో పోలప్ప జడ్పిటిసి గంగాదేవి, వైస్ ఎంపీపీలు సరళ గంగరాజు, సర్పంచులు కేశవరెడ్డి, ప్రకాష్, గీతాబాయి, హరితకో ఆప్షన్ నెంబర్ మున్వర్ భాష, ఎంపీటీసీలు సాంబశివారెడ్డి, లక్ష్మీ, దేవమ్మ, ఇంచార్జ్ తాహసిల్దార్ వెంకటరెడ్డి, ఏపీవో నాగిరెడ్డి, ఓబులేసు, ఎంఈఓ వెంకటరమణా నాయక్, ఐసిడిసి సూపర్వైజర్ పుష్పలత, హాస్టల్ వార్డెన్ సులోచన , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-బుక్కపట్నం: జగనన్న లేఔట్ నిర్మాణానికి భూమి ఇచ్చిన రైతులకు నష్టపరిహారం అదేవిధంగా చర్యలు చేపట్టాలని ఏపీ స్టేట్ హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్ జైన్ ను కలసి ఎంపీపీ శ్రీధర్ రెడ్డి , జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి బుధవారం జిల్లా పర్యటనకు చేసిన సందర్భంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిధిలోని గసగవారి పల్లె, చింతలయ్య గారి పల్లె గ్రామాలలో ఎస్సీ కాలనీ వాసుల కోసం జగనన్న నిర్మాణానికి భూమి ఇచ్చిన రైతులకు నష్టపరిహారం త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలో పి ఎఫ్ ఎం ఎస్ ద్వారా ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులకు ఐడి ప్రాబ్లం ద్వారా బిల్లులు మంజూరు కాలేదని వాటిని కూడా పరిష్కరించాలని తెలిపారు.



విశాలాంధ్ర - అగళి : అకాల వర్షాల కారణంగా రాయలసీమ జిల్లాలైన అనంతపురం, సత్యసాయి, కర్నూల్, నంద్యాల ,కడప, అన్నమయ్య ,చిత్తూరు, జిల్లాల్లో రైతులు వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని, పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతాంగం కష్టాల పాలైనారని పేర్కొన్నారు. ప్రాథమిక అంచనా మేరకు లక్షల ఎకరాలలో వ్యవసాయ ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి వరి మామిడి మొక్కజొన్న అరటి మిరప వేరుశనగ పంటలను అంచనా వేసి పరిహారాన్ని అందించాలన్నారు. పశువులకు మేత తడిసిపోయిందని పశువులకు ఉచితంగా మేతను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైభవంగా రథోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 27 నుండి అంగరంగ వైభవంగా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి. ఇందులో భాగంగా ఏడవ రోజు (మడుగు తేరు) రథోత్సవ కార్యక్రమం వందలాదిమంది భక్తుల నడుమ, ఉభయ దాతలు, స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి దంపతులు, పట్టణ ప్రముఖుల నడుమ అంగరంగ వైభవంగా ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం ఆలయ ఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. తదుపరి ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం,ఈవో వెంకటేశులు, ఎమ్మెల్యే దంపతులు, పట్టణ ఉభయ దాతలు, పేరిటన అర్చనలు, పూజలు నిర్వహించారు. పోలీసు బలగాలు కూడా డి.ఎస్.పి హుస్సేన్ పీరా, పట్టణ వన్టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్ఐలు మహమ్మద్ రఫీ అధిక సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొని, పూర్తి బందోబస్తు నిర్వహించి, విజయవంతమనకు ఎంతో కృషి చేశారు. రథోత్సవములో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్... లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవములో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ తో పాటు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తాదులను, ప్రజలను ఆప్యాయంగా పలకరించి ప్రసాదాలను స్వీకరించారు. వీరి ఇరువురికి ఆలయ కమిటీ వారు పట్టు వస్త్రాలు సమర్పించారు.



వైద్యశాల తనిఖీ

విశాలాంధ్ర-అమడగూరు: స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను సత్యసాయి జిల్లా నూతన కలెక్టర్ అరుణ్ బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి అందుబాటులో ఉండాలని డాక్టర్ మోనాను, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కసముద్రం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, తాసిల్దార్ రెడ్డి శేఖర్, ఎంపీడీవో నసీమాలను మండలంలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఈశ్వరయ్య, రెవెన్యూ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యకర్తలకు పరామర్శ

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: మండల కేంద్రానికి చెందిన వైసిపి, మైనారిటీ సెల్ నాయకులు వెల్డింగ్ భాష, టి.కె. కరీం భాషా లను పుట్టపర్తి నియోజకవర్గం మాజీ సమన్వయకర్త, సిఈసి రాష్ట్ర సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి పరామర్శించారు.కీళ్ల సంబందిత వ్యాధితో బాధపడుతున్న పార్టీ కార్యకర్తలను పరామర్శించి, ధైర్యం చెప్పారు. శస్త్ర చికిత్సలకు అవసరమైన ఏర్పాట్లు తనవంతు చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన యువ నాయకుడు బొద్దు నాగరాజు నివాసంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కొత్తకోట చక్రధర్ రెడ్డి,కొండకమర్ల నరసింహులు పాల్గొన్నారు.



సరిహద్దు భద్రత పై నిఘా పెంచండి

విశాలాంధ్ర-లేపాక్షి : ఈ నెలలోనే కర్ణాటక ఎన్నికలు జరుగుతుండడంతో ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో భద్రత పెంచాలని, ఎప్పటికప్పుడు సమాచారం అందుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు చోటు లేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని లేపాక్షి ఎస్ఐ మునిర్ అహ్మద్ కు సత్యసాయి జిల్లా నూతన ఎస్పీ ఎస్వి మాధవ రెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి పరిగి మండలంలోని మోద చెక్పోస్ట్ తూముకుంట చెక్పోస్ట్ లేపాక్షి లోని సరిహద్దు చెక్పోస్ట్ తనిఖీ నిర్వహించిన అనంతరం లేపాక్షి పోలీస్ స్టేషన్ పరిసరాలను సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలోని కొడికొండ చెక్ పోస్ట్ జాతీయ రహదారిలో బుధవారం ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా చెరువుకింద పల్లి గ్రామానికి చెందిన సంజీవప్ప 33కర్ణాటక మద్యం పాకెట్లు (90ఎంఎల్) తీసుకొని వస్తు, పోలీసుల తనిఖీ చేస్తున్నారని భావించి మద్యం పాకెట్లు కింద వేసి పారిపోయినాడు.

సామాజిక సేవకు అవార్డు

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన అష్షర్ తన సామాజిక సేవకు ఫలితంగా మనం ఫౌండేషన్ ద్వారా మే డే సందర్భంగా అవార్డును పొందడం జరిగింది. ఈ సందర్భంగా అప్సర్ బుధవారం మాట్లాడుతూ తాను గత మూడు సంవత్సరాలుగా పట్టణంలో అన్నదాన కార్యక్రమం తో పాటు రక్తదాన కార్యక్రమాన్ని కూడా చేయడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం సాయంత్రం బ్రహ్మ రథోత్సవం, దూలో దూలోచవము (గజ వాహనం) లు అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఆలయ ఈవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మ రథోత్సవాన్ని బుధవారం సాయంత్రం అంజుమాని సర్కిల్ వరకు రతాన్ని లాగి తిరిగి యధా స్థానానికి భక్తాదులు చేర్చారు. ఉభయ దాతలుగా పెనుజూరు అశ్వత్త నారాయణ అండ్ సన్స్, కార్తికేయ, బలరాం, రవితేజ, కృష్ణమూర్తి, డాక్టర్ సుమంత్, సాయి రంగా, కీర్తిశేషులు పెనుజూరి వెంకటాచలపతి, ప్రసాద్, కీర్తిశేషులు పెనుజూరి తిరుపాలయ్య శెట్టి భార్య భాగ్య రంగమ్మ, కలవల పెద్ద నారాయణ శెట్టి అండ్ సన్స్, కీర్తిశేషులు రామసుబ్బయ్య సన్స్, కీర్తిశేషులు కలవల గోపాల శెట్టి అండ్ సన్స్, కెవి చల పతి అండ్ సన్స్, ముకుంద అండ్ సన్స్, దివాకర్ అండ్ సన్స్,ప్రకాష్ అండ్ సన్స్ వ్యవహరించారు.రాత్రి దూలొస్తవం (గజ వాహనం)ద్వారా పట్టణ పురవీధులలో చెన్నకేశవ స్వామి ప్రజలకు దర్శనమి చ్చారు.ఈ కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం ఆలయ ఈవో వెంకటేశులు,ఆలయ ఉభయ దాతలు, ఉపాధ్యక్షులు కుండా చౌడయ్య ఆలయడైరెక్టర్లు,వేలసంఖ్యలోభక్తాదులు పాల్గొని పునీతులయ్యారు.

మజ్జిగ, నీరు పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం వారి బ్రహ్మోత్సవ వేడుకలు మార్చి 27 నుండి ఏప్రిల్ ఏడో తేదీ వరకు అత్యంత వైభవంగా ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కుండా చౌడయ్య, ఆలయ ఈవో వెంకటేశులు, ఉభయ దాతల నడుమ నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా జరిగే ఈ వేడుకలకు భక్తాదులతో పాటు, పట్టణంలోని పలువురు ఎండాకాలమును దృష్టిలో ఉంచుకొని భక్తాదులకు మజ్జిగ చల్లటి నీరు పానకము లాంటివి ఉచితంగా పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం రథోత్సవం సందర్భంగా పట్టణంలో సత్య సాయి సేవ సమితి వారు పానకము, మజ్జిగ, కూల్ వాటర్ పంపిణీ చేశారు. వైయస్సార్సీపి పార్టీ నాయకుడు 27వ వార్డ్ ఇంచార్జ్ డోలా రాజారెడ్డి మజ్జిగ పంపిణీ చేశార సాంబశివుడు, శేషాచారి, వెంకటేష్, లక్ష్మీనారాయణ,శ్రీనివాసులు, కాకుమాని విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. తదుపరి గీతం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు వాటర్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. అనంతరం శ్రీకృష్ణ చైతన్య భక్త భజన మండలి వారి ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి క్లాస్ అండ్ ప్లే వుడ్ వారి కుటుంబ సభ్యులచే వందలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చత్రపతి శివాజీ మరాఠా సంఘం వారు భక్తాదులకు చిత్రాన్నం వాటర్ ప్యాకెట్లు వందలాదిమందికి పంపిణీ చేశారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం పట్ల ఆలయ ఈవో వెంకటేశులు ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం ఉపాధ్యక్షులు కుండా చౌడయ్య లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తాదులు కూడా ఇటువంటి సదుపాయాలు చేయడం వారిని ఎంతగానో సంతోషించా రు. ఇటువంటి పంపిణీ కార్యక్రమాన్ని భక్తులతో పాటు జిల్లాల వారీగా వచ్చి స్వామివారిని దర్శించుకుని వేలాదిమంది భక్తజనం తరలిరావడం విశేషం.

భూసేకరణ పూర్తి చేయాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లాలో వివిధ జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్. చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పుట్టపర్తి కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే, 342, 716-జి, కదిరి బైపాస్, కొలెపల్లి రైల్ ఓవర్ బ్రిడ్జి, తదితర రహదారులకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో పుట్టపర్తి, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, కలెక్టరేట్ జి సెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ, నేషనల్ హైవే ఈఈ మధుసూదన్, నేషనల్ హైవే డిఈ గిడ్డయ్య, ఆయా మండలాల తహసిల్దార్లు, పాల్గొన్నారు.